



జాతీయ జెండా, అనంత బాలోత్సవం జెండాలను ఆవిష్కరిస్తున్న అతిథి జెఎన్‌టియు విసి సుదర్శనరావు, షమీమ్ షఫీవుల్లా, పద్మజ, సావిత్రి తదితరులు

చిన్నారుల మోములో ఆనందం వెల్లివిరిసింది.. ఆకాశమే హద్దుగా బాలబాలికలు సందడి చేశారు. మార్కుల వేటలో బందీ అయిన బాల్యానికి కాస్త ఆటవిడుపునిచ్చి నాట్య మయూరాల్లా విహరించారు. పుస్తకాలతో కుస్తీ పట్టిన చిట్టి చేతులు సేదదీరి కేరింతలు కొట్టాయి. నాలుగుగోడల మధ్య నిలిచిన సృజనాత్మకతను వెలికితీసి వారి ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పారు. బుడిబుడి అడుగులతో ఆసాంతం ఆ'బాల'గోపాలోత్సవాన్ని కనులముందు సాక్షాత్కరింపజేశారు. ఆటపాటలు, నృత్యరూపాలు, కళానైపుణ్యాలు, అద్భుతమైన తెలివితేటలతో ఆహుతులను సమ్మోహితులను చేశారు. సైన్స్ ప్రదర్శనలతో ఆలోచింపజేస్తూ.. వ్యాసరచన వకృత్వ పోటీలతో మొదడుకు పదునుపెట్టారు. 'అనంత బాలోత్సవం-5' వేదికగా వందలాది మంది చిన్నారులు ఆద్యంతం అనంత ముగింట ఇంద్ర ధనస్సును ఆవిష్కరింపజేశారు. అనంతపురం లలిత కళాపరిషత్ వేదికగా జరుగుతున్న అనంత బాలోత్సవాలు-5 శుక్రవారం నాడు అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో ప్రారంభం అయ్యాయి. మూడు రోజుల పాటు అనంత బాలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరిగే ఈ పిల్లల పండుగలో మొదటి రోజు జిల్లా నలుమూలల నుంచి వందలాది మంది విద్యార్థులు, చిన్నారులు పాల్గొని వారి ప్రతిభను ప్రదర్శించారు.



- ఉత్సాహభరితంగా 'అనంత బాలోత్సవం-5' ప్రారంభం
- ఎల్‌కెపిలో పిల్లల సందడే.. సందడి..!
- కట్టిపడేసిన చిన్నారుల నృత్యాలు, నాటికలు
- ఆకట్టుకున్న ప్రదర్శనలు
- ఆలోచింపజేసిన సైన్స్ నమూనాలు
- ఉదయం నుంచి సాయంత్రం వరకు తగ్గని జోష్

అదిరే(బా)ల..!



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి
అనంతపురం కలెక్టరేట్

అనంత బాలోత్సవం-5 పిల్లల పండుగ అనంతపురం నగరంలో శుక్రవారం ప్రారంభమైంది. మూడు రోజులపాటు పిల్లలు ఆటపాటలతో చిందులేయడమే కాకుండా, తమ విజ్ఞానాన్ని ప్రదర్శించే పోటీలు ఆరంభమయ్యాయి. మొదటి రోజు జరిగిన ఈ పోటీలతో లలిత కళాపరిషత్‌లో ఉత్సహపూరిత వాతావరణం నెలకొంది. జానపద గీతాలాపన, దేశభక్తి గీతాలాపన, లఘు నాటికలు, జానపద గేయాలు, నృత్యాలు, దేశభక్తి గీతాలు, ఏకపాత్రాభినయం ఊర్రూతలూగించాయి. నాటక ప్రదన్శలు ఆలోచింపజేశాయి. అకడమిక్ విభాగంలో వ్యాసరచన, వకృత్వం, చిత్రలేఖనం, కథా విశ్లేషణ, దినపత్రిక పఠనం, కథ రచన, కవిత రచన, సైన్స్ ఎగ్జిబిషన్, బెస్ట్‌ఫ్రం వేస్ట్, మెమోరీ టెస్ట్, కార్టూన్ పోటీల్లో పోటీల్లో పిల్లలు ప్రతిభ కనబరిచారు. రంగురంగుల దుస్తులతో కొంత మంది విద్యార్థులు విచిత్ర వేషధారణలో రాగా, సాంప్రదాయ దుస్తులైన లంగా వోని వేసుకుని జానపద పాటలు పాడారు. పిల్లల ప్రతిభా పాటవాలను చూసి తల్లిదండ్రులే కాదు అక్కడున్న వారంతా మురిసిపోయారు. తమ పాఠశాల విద్యార్థులు మెరుగైన ప్రదర్శన చేయాలంటూ ఉపాధ్యాయులు ఆరాటపడ్డారు. ఎనిమిది ప్రాంగణాల్లో విద్యార్థులు ప్రదర్శనలు చేశారు.

ఉత్సాహభరిత వాతారవణంలో ప్రారంభం

బాలోత్సవం -5 ఉత్సాహ భరిత వాతావరణంలో లలిత కళాపరిషత్ వేదికగా ప్రారంభం అయ్యింది. అక్కడ ఏర్పాటు చేసిన జాతీయ జెండా, అనంత బాలోత్సవం జెండాలను ముఖ్య అతిథులు జెఎన్‌టియు విసి సుదర్శనరావు, అనంత బాలోత్సవ కమిటీ ఛైర్మన్ షమీమ్ షఫీఉల్లాలు ఆవిష్కరించారు. అనంతరం ప్రారంభోత్సవ సభను ఎల్‌కెపి పూర్వ కార్యదర్శులు గాజుల నారాయణస్వామి, ఎ.నరసింహ్మ మూర్తి ప్రాంగణంలో నిర్వహించారు. ముఖ్య అతిథుల ప్రసంగం అనంతరం చిన్నారుల ప్రదర్శనలు ప్రారంభం అయ్యాయి.



సైన్స్ నమూనాలను ప్రదర్శిస్తున్న చిన్నారులు

బహుమతులు ప్రదానం

మొదటి రోజుకు సంబంధించి గెలుపొందిన వారికి సాయంత్రం బహుమతులను అందజేశారు. షమీమ్ షఫీఉల్లా అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎల్‌కెపి కార్యదర్శి పద్మజ, రవికాంత్ రమణ, అనంత బాలోత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, కార్య నిర్వాహక కార్యదర్శి వి.సావిత్రి, జిలాన్, ఇన్నర్‌వీల్ క్లబ్ ఛైర్మన్ జయంతి, కెనెరా బ్యాంకు మేనేజర్ సెంథిల్ గణేష్, సాయి ట్రస్ట్ ఛైర్మన్ విజయసాయికుమార్, ఎల్‌కెపి ఉపాధ్యక్షులు రామగోవింద సాగర్ తదితరులు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో



వివిధ వేషధారణలో చిన్నారులు



అల్లూరి వేషధారణలో ఉన్న కుమారుడితో బాలోత్సవానికి వస్తున్న తల్లిదండ్రులు

అనంత బాలోత్సవ కమిటీ సభ్యులు ఓతూరు పరమేష్, రమణయ్య, గోవిందరాజులు, లింగమయ్య, నాగేంద్ర, విరూపాక్షి, పవన్‌కుమార్, సుబ్బరాయుడు, ఎజి.రాజమోహన్, చంద్రిక, రామాంజినమ్మ, శ్యామల, అశ్విని, అరుణమ్మ పాల్గొన్నారు.



ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న జెఎన్‌టియు విసి సుదర్శనరావు

విద్యార్థులకు ఎంతో ఉపయోగం

జెఎన్‌టియు విసి సుదర్శనరావు

అనంత బాలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పిల్లల పండుగ విద్యార్థులు, చిన్నారులకు ఎంతో ఉపయుక్తంగా ఉన్నాయని జెఎన్‌టియు విసి సుదర్శనరావు తెలిపారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు ఆట పాటలు ఎంతో అవసరం అన్నారు. వారిలో దాగున్న సృజనాత్మకత వెలికి తీయడానికి బాలోత్సవం చక్కటి వేదిక అన్నారు.

◆బాలోత్సవ కమిటీ ఛైర్మన్ షమీమ్ షఫీఉల్లా మాట్లాడుతూ అనంత బాలోత్సవాన్ని పండుగ వాతావరణంలో నిర్వహిస్తున్నామన్నారు. ఏడాదికేడాది రెట్టించిన ఉత్సాహంతో విద్యార్థులు పాల్గొంటూ ఉండడం సంతోషంగా ఉందన్నారు. మూడు రోజులు పాటు నిర్వహించే ఈ కార్యక్రమాలను పిల్లలు అందరూ సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఎల్‌కెపి కార్యదర్శి పద్మజ మాట్లాడుతూ విద్యార్థులు ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడమే గొప్ప అనుభూతి అన్నారు. గెలుపోటమలు పక్కన బెట్టి ఇలాంటి కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.



◆'కుల మతాలు మనకొద్దు... విజ్ఞాన శాస్త్రం ముద్దు.' అని మాజీ ఎమ్మెల్యే డా॥గేయానంద్ బాలోత్సవం వేదిక నుంచి పిల్లలతో చెప్పించి ఉత్సహపరిచారు.



విద్యార్థి తరపున బహుమతి అందుకుంటున్న ఉపాధ్యాయులు

17న అంగన్వాడీల సమస్యలపై ఆందోళన



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఇఎస్. వెంకటేష్

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

అంగన్వాడి కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 17న ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయాల ముందు నిర్వహించే నిరసన, ధర్నా కార్యక్రమాలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్ పిలుపునిచ్చారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంగన్వాడీలకు వేతనాలు పెంచి గ్రాట్యూటీ అమలు చేయాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని తదితర డిమాండ్లతో ఫిబ్రవరి 17న ప్రాజెక్టు ఆఫీసుల వద్ద చేపట్టే ధర్నాలను జయప్రదం చేయాలని ఆయన కోరారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా 2019 నుండి అంగన్వాడీలకు వేతనాలు పెరగలేదన్నారు. సమస్యల పరిష్కారం కోసం గతంలో నిర్వహించిన సమ్మె ముగింపు సందర్భంగా అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు దాటుతున్న అంగన్వాడీ సమస్యలపై చర్చించే వారే లేరన్నారు. పలు డిమాండ్లతో ఈనెల 17న ప్రాజెక్టు కార్యాలయాల వద్ద జరిగే నిరసనలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో పుట్టపర్తి ప్రాజెక్టు అధ్యక్షులు సుజాత, ప్రధాన కార్యదర్శి నాగమణి, సిఐటియు మండల కన్వీనర్లు బ్యాళ్ల అంజి, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

పెనుకొండ టౌన్ : అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. ఈ నెల 17వ తేదీన ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్నామని శుక్రవారం పట్టణంలోని సీడీపీవో కార్యాలయంలో సీడీపీవో శాంత లక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చి 8నెలల కాలం అవుతున్నా నేటికీ అంగన్వాడీల సమస్యలు పట్టించుకోలేదన్నారు. అంగన్వాడీ వర్కర్ల సమస్యలు రోజురోజుకు పెరుగుతున్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పెనుకొండ ప్రాజెక్టు పరిధిలో ఉన్న హెల్పర్స్ కు ప్రతి మూడు నెలలకు ఒకసారి మీటింగ్ ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సెక్టార్ లీడర్లు సావిత్రమ్మ, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీవోలు క్షేత్రస్థాయిలో పర్యటించాలి : కలెక్టర్



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

ఆర్డీవోలు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్లో రెవెన్యూ డివిజన్లో అధికారులతో నియోజకవర్గాల విజన్ ప్రణాళికపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్డీవోలు బాధ్యతగా పనిచేయాలన్నారు. వారి డివిజనల్‌లో వారికి సర్వాధికారాలు ఉన్నాయన్నారు. స్కానింగ్ సెంటర్లపై దాడులను నిర్వహించాలని, ప్రభుత్వ ఆసుపత్రులు తనిఖీ చేయాలని, డివిజనల్ స్థాయి కమిటీలో లీగల్ సెల్ సభ్యులను నియమించాలని చెప్పారు. అలాగే వివిధ లైసెన్స్ కలిగిన ఫార్మసీ దుకాణాలు తనిఖీలు నిర్వహించాలన్నారు. ఆయా నియోజకవర్గానికి సంబంధించిన విజన్ ప్రణాళికలను, రాబోయే ఐదు సంవత్సరాలలో నియోజకవర్గంలో ఎలా అభివృద్ధి చేయాలి, ఏ విధంగా ప్రణాళికలు అమలు చేయాలి, ప్రతికూల అంశాలు సానుకూల అంశాలపై సమగ్ర నివేదికలు అందజేయాలని ఆదేశించారు. జిల్లాలో ఏయే గ్రామాలలో టవర్లను ఏర్పాటు చేయడానికి అభ్యర్థన లేఖలు సిద్ధం చేయాలని ఆదేశించారు. భూమి లభ్యత నివేదిక సమర్పించడానికి గ్రామాల వారీగా చెక్‌లిస్ట్‌ను సిద్ధం చేయాలని ఆదేశించారు. పాఠశాలల హేతుబద్ధీకరణ తుది ఆమోద సమాచారాన్ని వచ్చే సమావేశంలో చర్చించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు పుట్టపర్తి సువర్ణ, ధర్మవరం మహేష్, కదిరి శర్మ, పెనుగొండ ఆనంద్, మడకశిర నియోజకవర్గ ప్రత్యేక అధికారి మరియు డిప్యూటీ స్పెషల్ కలెక్టర్ సూర్యనారాయణ రెడ్డి, గ్రామ వార్డు సచివాలయాల నోడల్ అధికారి సుధాకర్ రెడ్డి, డిఇఒ కిష్టప్ప, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

ప్రజాశక్తి-హిందూపురం

స్వయం సహాయక సంఘాలు బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుంటూ ఆర్థిక అభివృద్ధి సాధించాలని మెప్మా మిషన్ డైరెక్టర్ తేజ్ భరత్ సూచించారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో స్వయం సహాయక సంఘాల గ్రూప్ లీడర్లకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మెప్మా ఆధ్వర్యంలో అమలవుతున్న పథకాలు, వినియోగం తదితర అంశాలపై వివరించారు. స్వయం సహాయక సంఘాల రుణాలు, స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్, టిడ్కో కాలనీ, ఎలక్ట్రికల్ వాహనాలు, క్యాంటీన్లు వంటి తదితర కార్యక్రమాలపై మహిళలకు అవగాహన కల్పించారు. నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఎంసి ఎల్.గంగులయ్య, ఇబ్రహీం ఖాన్, సిఒలు తౌసిఫ్, నాగేశ్వరి, పరంజ్యోతి, గంగరత్న, వరలక్ష్మి లు, తెలుగుతల్లి పట్టణ సమాఖ్య కార్యదర్శి సరస్వతి, కోశాధికారి సుజాత, భరతమాత అధ్యక్షురాలు నలినాక్షి, టిఎల్ఎఫ్ ఆర్‌పి.నవ్య, పట్టణ సమాఖ్య ఈసీ సభ్యులు పాల్గొన్నారు.

18 నుంచి తాగునీటి సరఫరా కార్మికుల నిరవధిక సమ్మె

- వేతనాలు ఇచ్చే వరకు సమ్మె ఆగదు
- సిఐటియు రాష్ట్ర నాయకులు జి.ఓబులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

పెండింగ్ వేతనాలు, ఇతర సమస్యల పరిష్కారం కోరుతూ ఉమ్మడి జిల్లా నీలకంఠాపురం శ్రీరామ్ రెడ్డి తాగునీటి సరఫరా కార్మికులు సమ్మెకు సిద్ధం అయ్యారు. ఈ మేరకు ఈ నెల 18 నుంచి సమ్మెలోకి వెళ న్నట్లు ప్రకటించారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు నగరంలోని జన విజ్ఞాన వేదిక కార్యాలయంలో ఉమ్మడి జిల్లా నీలకంఠాపురం శ్రీరామ్ రెడ్డి తాగునీటి పథకం కార్మికులు సమావేశం నిర్వహించారు. ఇందులో సమ్మెకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు, అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ తాగునీటి సరఫరా కార్మికులు ప్రతిసారి సమ్మె చేస్తేనే వేతనాలు ఇచ్చే పరిస్థితి ఉందన్నారు. నీలకంఠాపురం శ్రీరామ్ రెడ్డి వాటర్ సప్లై స్కీం ద్వారా ఉమ్మడి అనంతపురం జిల్లాలో పీఏబీఆర్ డ్యాం, కళ్యాణ్ దుర్గం, రాయదుర్గం, బెలుగుప్ప, పరిగి, హిందూపురం, మడకశిర డివిజన్లో 850 గ్రామాలకు 600 మంది కార్మికులు ఉచితంగా తాగునీరు అందిస్తున్నారని చెప్పారు. 10 నెలలు వేతనాలు ఇవ్వకపోతే కార్మికుల కుటుంబాల పోషణ ఎలా అన్న విషయాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు గుర్తించాలన్నారు. తాము అధికారంలోకి వస్తే ఐదవ తేదీ లోపు ప్రతినెలా వేతనాలు అందించే బాధ్యత తీసుకుంటామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. ఈ స్కీంలో పనిచేసే హిందూపురం ప్రాంతంలో 10 నెలలు, అనంతపురం జిల్లాలో ఆరు నెలలు వేతనాలు బకాయి ఉన్నాయన్నారు. 30 నెలల పిఎఫ్ బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. గత సంవత్సరం 2024 సెప్టెంబర్ నెలలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, కాంట్రాక్టర్లు కలిసి కార్మికుల మధ్య జరిగిన ఒప్పందం అమలు చేయలేదు. కార్మికులకు ఈఎస్ఐ, బోనస్ వెంటనే అమలు చేయాలన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇస్తూ ప్రతి నెలా 5వ తేదీలోపు క్రమం తప్పకుండా ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలన్నింటినీ పూర్తి స్థాయిలో పరిష్కరించేలా స్పష్టమైన హామీని ఇచ్చేంత వరకు సమ్మెను విరమించమన్నారు. ఈ కార్యక్రమంలో తాగునీటి సరఫరా యూనియన్ నాయకులు జి.రాము, నాగరాజు, వన్నూరు స్వామి, సోము, లోకేష్, మురళి, నాగేంద్ర, రామాంజనేయులు, నరేష్, నంది, వన్నూరప్ప, మురళీకృష్ణ, ఎర్రిస్వామి పాల్గొన్నారు.



సమ్మె సన్నాహక కార్యక్రమంలో మాట్లాడుతున్న జి.ఓబులు

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



ప్రశంసాపత్రాలు అందజేస్తున్న డిఇఒ

ప్రజాశక్తి - బుక్కపట్నం

విద్యార్థులు చదువులతోపాటు క్రీడల్లోనూ రాణించి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని జిల్లా విద్యాధికారి కిష్టప్ప తెలిపారు. బుక్కపట్నం జిల్లా పరిషత్ హై స్కూల్‌కు చెందిన విద్యార్థులు 2024, 25 సంవత్సరంలో పలు క్రీడలలో సత్తా చాటారు. వీరిలో 21 మంది విద్యార్థులు పలు విభాగాలలో రాష్ట్రస్థాయిలో సత్తా చాటిన విద్యార్థులకు శుక్రవారం బంగారు పతకాలు, ప్రశంసా పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో రాణించడం హర్షించదగ్గ విషయమన్నారు. చదువులతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని తెలిపారు. పవర్ లిఫ్టింగ్‌లో బంగారు పతకం సాధించిన విద్యార్థి గణేష్ రెడ్డి, హాకీలో తృతీయ స్థానం సాధించిన ప్రశాంత్ రెడ్డితో పాటు ఆయా విభాగాలలో పతకాల సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ గోపాల్ నాయక్, ప్రధాన ఉపాధ్యాయుడు జగదీష్, పీడీ నాగరాజు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ సమైక్యత శిబిరానికి ఎన్ఎస్‌పిఆర్ విద్యార్థిని

ప్రజాశక్తి-హిందూపురం

స్థానిక ఎన్ఎస్‌పిఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతున్న జే.దుర్గ జాతీయ సమైక్యతా శిబిరానికి ఎంపికైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. ప్రగతి తెలిపారు. ఎంపికైన విద్యార్థినిని కళాశాలలో ప్రిన్సిపల్ తో పాటు అధ్యాపకులు అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతు మహారాష్ట్రలోని కోల్హాపూర్ లో శివాజీ యూనివర్సిటీలో ఈనెల 16 నుండి 22 వరకు వారం రోజుల పాటు జరిగే శిబిరంలో ఎస్కే యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం నుండి ఎన్ఎస్ఎస్ వాలంటీర్ గా ఎంపికై ఆంధ్రప్రదేశ్ తరపున పాల్గొంటున్నట్లు ప్రిన్సిపల్ తెలిపారు. ఈ జాతీయ సమైక్యత శిబిరంలో తమ కళాశాల విద్యార్థి ఎన్ఎస్ఎస్ వాలంటీర్‌గా ఎంపిక కావడం కళాశాలకే గర్వకారణమన్నారు. జాతీయ సమైక్యాతా శిబిరానికి ఎస్కేయు ఎన్ఎస్ఎస్ విభాగం తరపున ఆంధ్రప్రదేశ్ టీమ్ గా ఎంపికైన పదిమంది వాలంటీర్లకు కళాశాల ప్రిన్సిపల్ ఎన్ఎస్ఎస్ క్యాప్‌లను బహూకరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ వెంకటేసులు, ఐక్యూఎసి కోఆర్డినేటర్ శ్రీ లక్ష్మి, అధ్యాపకులు యశోద, ఎల్. ఆర్.రమేష్, రవి నాయక్, పీడీ విజయలక్ష్మి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రంగనాయకులు, సీనియర్ అసిస్టెంట్ బి నరసింహులు పాల్గొన్నారు.

నేడు మెగా జాబ్‌మేళా

ప్రజాశక్తి - మడకశిర

స్థానిక ఎమ్మెల్యే ఎమ్మెస్‌రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో నిర్వహించే జాబ్ మేళా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని టిడిపి మండల కన్వీనర్లు లక్ష్మీనారాయణ, మద్దనకుంటప్ప, గణేష్, కుమారస్వామి, దాసిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శనివారం ఉదయం 10.00 గంటలకు పట్టణంలోని మధుగిరి రోడ్డులో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించే జాబ్ మేళాను నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సాదాసీదాగా మండలమీట్

ప్రజాశక్తి - పెనుకొండ

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపీపీ గీత రామ్మోహన్ రెడ్డి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన మండల సాధారణ సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. సమస్యలపై ఎలాంటి చర్చ జరపకుండానే సమావేశాన్ని మమ అనిపించారు. ఆయా శాఖల అధికారులు వారి పరిధిలోని ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తే అవకాశా లున్న వాటికి తగ్గట్టుగా చర్యలు చేపట్టాలని సభ్యులు అధికారులను కోరారు. ఈ సమావేశంలో ఎంపీడీవో నరేష్‌కృష్ణ, వైస్ ఎంపీపీ రామాంజనేయులు, సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. సభ ప్రారంభానికి ముందు దామోదర సంజీవయ్య జయంతి సందర్భంగా ఎంపీపీ గీతా రామ్మోహన్ రెడ్డి తదితరులు దామోదర సంజీవయ్య చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

సర్వేకు సహకరించండి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

వాణిజ్య ,వ్యాపార సంస్థలు, సేవా రంగాలు ,పరిశ్రమల నిర్వాహకులు ఎంఎస్‌ఎంఇ సర్వేకి సహకరించాలని జిల్లా పరిశ్రమల అధికారి జి నాగరాజు కోరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏపీ ప్రభుత్వం మొబైల్ యాప్ ఆధారిత ఎంఎస్‌ఎమ్‌ఇల సర్వే నమోదు కార్యక్రమాన్ని చేపడుతుందని దీనికి అన్ని రంగాలు సహకరించాలని కోరారు. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది చేత ఇప్పటికే నిర్వహించబడుతున్న సర్వేకు జిల్లా లోని అన్ని వాణిజ్య, వ్యాపార సంస్థలు, సేవా రంగాలు, పరిశ్రమల నిర్వాహకులు సహరించాలని కోరారు.

పంటకోత ప్రయోగాలు

ప్రజాశక్తి బత్తలపల్లి

మండలంలోని ఈదుల ముష్టురు గ్రామంలో ఎఎస్ఓ డాక్టర్ లక్ష్మీ నరసింహాశర్మ పర్యవేక్షణలో పంటకోత ప్రయోగాలను శుక్రవారం నిర్వహించారు. గ్రామంలోని రైతు లక్ష్మీనారాయణచౌదరి సాగుచేసిన కందిపంటలో పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విఎఎ నికిత కుమారి, ఎఇఒ ఉపేందర్ రెడ్డి, అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ మండల కోఆర్డినేటర్ మంజునాథ, మహేష్ తదితరులతో పాటు రైతులు పురుషోత్తం, బాబావలి, సత్యనారాయణ, కాటమయ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సామాజిక తనిఖీ

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

ధర్మవరం మండలంలో 2023-2024 ఆర్థిక సంవత్సరములో ఉపాధిహామీ నిధుల ద్వారా చేపట్టిన వివిధ రకాల పనులకు సంబందించిన సోషల్ ఆడిట్ కార్యక్రమం శనివారం నుండి నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ సాయి మనోహర్ తెలిపారు. ఈ సామాజిక తనిఖీ కార్యక్రమానికి మండలంలోని సర్పంచులు , ఎంపీటీసీలు, జెడ్పీటీసీతో పాటు స్థానిక నాయకులు సహకరించాలని కోరారు.

ప్రతి రైతు గుర్తింపు కార్డు పొందాలి

ప్రజాశక్తి - గాండ్లపెంట

ప్రతి రైతు గుర్తింపు కార్డు పొందాలని స్థానికవ్యవసాయ అధికారిని బి లక్ష్మీప్రియ తెలిపారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు అందాలంటే స్థానిక రైతు సేవ కేంద్రాల్లో రిజిస్టర్ చేయించుకోవాలన్నారు. రైతు పట్టాదారు పాసు పుస్తకం ఆధార్, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్, సెల్‌నెంబర్ తీసుకుపోతే రిజిస్టర్ చేసుకుంటారన్నారు.

శిక్షణ తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి - ముదిగుబ్బ

స్థానిక వెలుగు కార్యాలయంలో క్రాంతి మండల సమాఖ్య ఆధ్వర్యంలో మండల మహిళా సమైక్య ఈసీ సభ్యులకు రెండురోజుల శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. మొదటిరోజు స్టేట్ రిసోర్స్ పర్సన్ ఈశ్వరమ్మ, సరస్వతి, శిక్షణ ఇచ్చారు. మండల సమైక్య ఆవశ్యకత కార్యక్రమాలు, మండల సమైక్య నిర్మాణం, విధులు బాధ్యతల గురించి అవగాహన కల్పించారు. ఈ శిక్షణ కు జిల్లా సమైక్య ఒబి రాజేశ్వరి, వనజ, మండల మహిళా సమైక్య కార్య నిర్వహణ వర్గం ఇసి సభ్యులు, ఎపిఎం హేమలత, సీసీలు అశ్వత్ రెడ్డి, రామాంజనేయులు, రామచంద్ర, మల్లికార్జున, చంద్రమోహన్ రెడ్డి,అకౌంటెంట్ రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఉత్సవాల కరపత్రాలు విడుదల

ప్రజాశక్తి - లేపాక్షి

మండల కేంద్రంలోని దుర్గా వీరభద్ర పాపానసేశ్వర ఆలయం లో ఈ నెల 25నుండి నిర్వహించే మహాశివరాత్రి ఉత్సవాలకు సంబందించిన కరపత్రాలను ఆలయ చైర్మన్ రామానంద్ ఆధ్వర్యంలో శుక్రవాంర ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఏటా వైభవంగా నిర్వహించే మహాశివరాత్రి ఉత్సవాలకు అన్ని రకాల ఏర్పాట్లు చేశామన్నారు. ఈ ఉత్సవాల్లో పాల్గొని విజవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ఆదినారాయణ, ఈవో నరసింహ మూర్తి, అర్చకులు శీనస్వామి, సింహం స్వామి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో దృష్టి లోపాలను నివారిద్దాం

కలెక్టర్ టిఎస్. చేతన్



విద్యార్థినికి కంటి అద్దాలు అందజేస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి - బుక్కపట్నం

విద్యార్థుల భవితకు దృష్టిలోప నివారణ ప్రధానమని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. జాతీయ అందత్వ, దృష్టిలోప నివారణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మనిషి అవయవాల్లో కన్ను ప్రధానమైన అవయవం అని అన్నారు. ముఖ్యంగా విద్యార్థులకు దృష్టిలోపం ఉంటే చదవడానికి, రాయడానికి ఇబ్బందులు ఎదురవుతాయని అన్నారు. భవిష్యత్తులో కంటి సమస్యలు లేకుండా జాగ్రత్త పడాలన్నారు. అనంతరం పాఠశాల ఆవరణంలో పెంచిన మొక్కలను పరిశీలించారు. మొక్కలను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరు తీసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా స్కూల్ ఆవరణలో కలెక్టర్ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి ఫైరోజ్ బేగం, డీఈవో రంగయ్య, ఎంఈవో గోపాల్ నాయక్, ప్రభుత్వ వైద్యాధికారి సునీల్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జగదీష్, పాఠశాలకు సిబ్బంది, ప్రాథమిక వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ :స్థానిక జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్ విద్యార్థినులకు నగర పంచాయతీ కమిషనర్ సతీష్ కుమార్ కళ్లద్దాలను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల పిల్లల కంటి పరీక్షా కార్యక్రమంలో భాగంగా కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి అద్దాలు ఉచితంగా అందిస్తున్నామన్నారు. విద్యార్థులు చదువుల్లో రాణించాలన్నారు. చదువుకునేటప్పుడు కంటిలో ఏమైనా సమస్యలు ఎదురైతే తక్షణం వైద్యులను సంప్రదించి పరీక్షించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వాసుపత్రి సహాయ కంటి వైద్యులు డి. శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయురాలు జ్యోతిలత, ఉపాధ్యాయులు, ఎఎన్ఎంలు, విద్యార్థినులు పాల్గొన్నారు.

నల్లచెరువు :స్థానిక కెజిబివి విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. సిహెచ్ఒ రామచంద్ర రెడ్డి ఆధ్వర్యంలో కెజివివిలో ఆరోగ్యసిబ్బంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. పదో తరగతి విద్యార్థినులకు పరీక్షలు రాసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం సరస్వతి, ఎంఎల్‌హెచ్‌పి నస్రిన్, హెల్త్ అసిస్టెంట్ సూర్యనారాయణ రెడ్డి, కేజీబీవీ నర్సింగ్ అసిస్టెంట్ మేరీ, కేజీబీవీ ఇన్‌ఛార్జి తదివతరలుఉ పాల్గొన్నారు.

హిందూపురం : అంధత్వ నివారణకు సమిష్టిగా కృషి చేద్దామని మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక మహాత్మా గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జాతీయ అంధత్వ, దృష్టిలోపం నివారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆఫ్తాలిక్ అసిస్టెంట్ గోవర్ధన్ రెడ్డి విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన విద్యార్థులకు కళ్లద్దాలను ప్రభుత్వం నుండి ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ, విద్యార్థి ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఏదైనా సాధించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సామ్రాజ్యం, ఫిజికల్ డైరెక్టర్ లోక్‌నాథ్, ఎఎన్ఎం పద్మలీల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చేనేత సమస్యలను పరిష్కరించాలని మంత్రికి వినతి

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆంధ్ర ప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పోలా లక్ష్మీనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి బుడగ వెంకటనారాయణ కోరారు. ఈ మేరకు వారు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని రోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్‌కి శుక్రవారం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రస్తుతం ధర్మవరంలో చేనేత పరిశ్రమ, ఈ పరిశ్రమలు నమ్ముకున్న చేనేత కార్మికులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. చేనేత కార్మికులకు ఎన్నికల హామీలైన నేతన్న నేస్తం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్తును వెంటనే అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా చేనేత జౌళి శాఖ కార్యాలయాన్నిధర్మవరంలో ఏర్పాటు చేయాలని, చేనేత కార్మికులకు హెల్త్ కార్డు ద్వారా వైద్య సదుపాయం కల్పించాలని, 11 రకాల చేనేత ఉత్పత్తుల రిజర్వేషన్ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని కోరారు. అదే విధంగా చేనేతపై జీఎస్టీని పూర్తిగా రద్దు చేయాలని, ఆదరణ పథకాన్ని పునరుద్ధించి వృత్తి పరికరాలను సబ్సిడీలతో పంపిణీ చేయాలని విన్నవించారు. చేనేత ఉత్పత్తులకు ప్రభుత్వమే మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని, చేనేతలకు ప్రత్యేక బ్యాంకులను ఏర్పాటు చేసి సబ్సిడీ రుణాలను తొందరగా మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన మంత్రి మాట్లాడుతూ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుని వెళ్లి తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు వెంకటస్వామి, ఆదినారాయణ, శ్రీనివాసులు, మంజుల బాల రంగయ్య, జిల్లా సహాయ కార్యదర్శి చెన్నంపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సత్యసాయి శతజయంతి ఉత్సవాలపై సమీక్ష

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

సత్యసాయి శతజయంతి ఉత్సవాలలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా ప్రభుత్వపరంగా తగిన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ పేర్కొన్నారు. సత్యసాయి శత జయంతి ఉత్సవాలపై ట్రస్టు ప్రతినిధులతో పాటు సంబంధిత జిల్లా అధికారులతో జెసి సమీక్ష సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు రోమల్, చలం, అధికారులు డిఎఫ్ఒ చక్రపాణి, విద్యుత్ శాఖ ఎస్ ఈ సురేంద్రనాథ్, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, డిపిఒ, డిఎస్‌పి, ఆర్డీవో ఆధ్వర్యంలో పార్కింగ్ కోసం స్థల పరిశీలన చేపట్టాలన్నారు. టూరిజం ఆధ్వర్యంలో సత్యసాయి పుట్టిన స్థలంలో, బాబా తల్లి సమాధి రోడ్డు, చిత్రావతి నది పరివాహకం సుందరీకరణ పనులపై ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. మొబైల్ టాయిలెట్స్, రవాణా సేవలు, సురక్షితమైన తాగునీరు, తాత్కాలిక బస్ స్టేషన్లు, వైద్య శిబిరాలు, తాత్కాలిక వసతి సౌకర్యాలపై సంబంధిత అధికారులు నివేదికలు సిద్ధం చేయాలన్నారు. మున్సిపాలిటీ పరిధిలో విద్యుత్‌కు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. పారిశుధ్యం పై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, అవసరమైన పారిశుధ్య కార్మికులను ఇతర మున్సిపాలిటీల నుంచి రప్పించి ఏర్పాట్లు చేసుకోవాలని కమిషనర్ ప్రహల్లాదను జెసి ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు తమ పరిధిలోని పనులను చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి డీఎస్పీ విజయ్ కుమార్, ఆర్డీవో సువర్ణ, డిఆర్‌డిఎ పీడీ సరసయ్య సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ

తాగునీటి ఎద్దడి తలెత్తనివ్వొద్దు

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

రాబోయే ఎండాకాలంలో ధర్మవరం మండలంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ సాయిమనోహర్ సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. నీటి సరఫరాకి ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రతీ గ్రామంలో బోర్ల మరమ్మతు వంటివి వుంటే తక్షణమే పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేషన్ అధికారి అబ్దుల్ నబీ, సీనియర్ అసిస్టెంట్ సుబ్రహ్మణ్యం, పంచాయతీ బోర్ రిపేర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'ఈ ఆఫీసు' శిక్షణ తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ఈ-ఆఫీస్ శిక్షణ తరగతులను ఎస్పీ వి.రత్న శుక్రవారం ప్రారంభించారు. డిజిపి ఆదేశాల మేరకు ఈ - ఆఫీస్ శిక్షణ తరగతులు ఆన్లైన్ ద్వారా నిర్వహిస్తున్నారు.ఈ ఆఫీస్ శిక్షణా తరగతులు శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రారంభమయ్యాయి.ఈ శిక్షణ తరగతులకు జిల్లా పోలీస్ కార్యాలయ డిపిఒ అధికారులు, సిబ్బంది, జిల్లాలో అన్ని పోలీస్ స్టేషన్ లోని అధికారులు, సిబ్బంది విసి ద్వారా హాజరై వీటి ఆవశ్యకత గురించి తెలుసుకున్నారు.

సమయపాలన పాటించని సచివాలయ సిబ్బంది

ప్రజాశక్తి - రొద్దం

మండలంలోని చోలే మరి సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. దీంతో వివిధ పనుల నిమిత్తం సచివాలయానికి వచ్చే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇందులో భాగంగా శుక్రవారం కొంతమంది సిబ్బంది 10 గంటలకి హాజరైన సచివాలయ భవనం తాళాలు ఉన్నవారు సమయానికి రాకపోవడంతో వారు బయటే ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబందిత ఉన్నతాధికారులు స్పందించి సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వీర సైనికులకు ఘన నివాళి

ప్రజాశక్తి-హిందూపురం

పుల్వామా దాడిలో వీరమరణం పొందిన సైనికులకు బిట్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం అధ్యాపకులు, విద్యార్థులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ రమేష్ మాట్లాడుతు వీర జవాన్ల త్యాగాన్ని ఎప్పటికీ మరచిపోలేమని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగల తొలగింపు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - రొద్దం

రోడ్డు మీద వేసిన విద్యుత్ తీగలను అధికారులు తొలగించారు. రోడ్డుపై విద్యుత్ తీగలు అనే శీర్షికన ఈనెల 5వ తేదీన ప్రజాశక్తి దినపత్రికలో వెలవడిన కథనానికి అధికారులు స్పందించారు. దీంతో పలువురు సంతోషం వ్యక్తం చేశారు.

కోత విధించిన రేషన్ బియ్యం ఇవ్వాలి: వైసిపి

ప్రజాశక్తి మడకశిర

ప్రభుత్వం చౌక ధాన్య దుకాణాల ద్వారా ఇస్తున్న బియ్యం కోటాలో దాదాపు 25 శాతం ఈ నెలలో కోత విధించారని కోత విధించిన బియ్యాన్ని వెంటనే సరఫరా చేయాలని వైసిపి జిల్లా అధికార ప్రతినిధి ఆనంద రంగారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు పరచకుండా ప్రజలను కష్టాలకు గురిచేస్తుందన్నారు. ఇవ్వవలసిన బియ్యం ఇతర వస్తువులు కోత విధించడం సరికాదని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కోత విధించిన బియ్యం కందిపప్పు నూనె ఇతర సరుకులను వెంటనే సరఫరా చేసి పేదలను న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ఉన్నత విలువలకు మారుపేరు దామోదరం సంజీవయ్య



దామోదరం సంజీవయ్య చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

నిరాడంబరతకు ఉన్నత విలువలకు మారుపేరుగా దామోదరం సంజీవయ్య నిలుస్తారని కలెక్టర్ టిఎస్ చేతన్ కొనియాడారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్లో సంజీవయ్య 104వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్‌తో పాటు డిఆర్ఓ విజయ సారథి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూసామాన్య దళిత కుటుంబంలో జన్మించి సంజీవయ్య తొలి దళిత ముఖ్యమంత్రిగా కేంద్రమంత్రిగా ఉన్నత విలువలతో బతికారని, దేశానికి, రాష్ట్రానికి ఎన్నో సేవలందించారని అన్నారు. **సంజీవయ్య ఆదర్శప్రాయులు : జేసీ** ఆదర్శప్రాయులుగా సంజీవయ్య నిలిచారని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సాయి ఆరామంలో ప్రభుత్వ అధికారికంగా ఆయన జయంతి ఉత్సవాలు నిర్వహించారు. సంజీవయ్య చిత్రపటానికి పూలమాలను వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ బేకరీ గంగాధర్, డీఎస్పీ విజయ్ కుమార్, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి శివ రంగ ప్రసాద్ పలువురు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ దామోదరం సంజీవయ్య కేంద్ర మంత్రిగా, కార్మిక శాఖ విద్యా శాఖలో పలు సంస్కరణలు చేపట్టారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్పిఎస్ నాయకులు, పైపల్లి నరసింహులు, ఎస్సీ మానిటరింగ్ కమిటీ సభ్యులు వీరనారాయణ, పైపల్లి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

మడకశిర :నేటి తరం యువతకు దామోదరం సంజీవయ్య జీవితం ఆదర్శంగా నిలుస్తుందని తహశీల్దార్ కరుణాకర్ తెలిపారు. తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి సందర్భంగా స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు తహశీల్దార్ కరుణాకర్ మాల మహానాడు నాయకు లతో కలిసి దామోదర్ సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సోముకుమార్, కాచికుంట వెంకటేష్, న్యాయవాది కృష్ణమూర్తి, లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : తొలి దళిత ముఖ్యమంత్రి దామోదర సంజీవయ్య జయంతిని శుక్రవారం మండల కేంద్రమైన బత్తలపల్లిలోని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. దామోదర సంజీవయ్య చిత్రపటానికి ఎంపీడీవో నరసింహనాయుడు, కార్యాలయ పరిపాలన అధికారి శ్రీనివాసులు, ఈవోఆర్డీ క్రిష్టప్ప,ఏపీవో ఆదెప్ప తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, డిస్ట్రిక్ట్ అంబుడ్స్ మెన్ శివారెడ్డి, ఈసీ నాగార్జునతదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో దామోదరం సంజీవయ్య జయంతిని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సాయి మనోహర్, కార్యాలయ పరిపాలన అధికారి అబ్దుల్ నబి, సీనియర్ సహాయకులు సుబ్రహ్మణ్యం, ఎపిఒ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : స్థానిక విశ్రాంతి ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో దామోదర్ సంజీవయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎన్జీవో కార్యాలయంలో దామోదర్ సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు కటిక జయరాం, హిందూపురం విశ్రాంతి ఉద్యోగుల సంఘ నాయకులు, విశ్రాంతి ఉపాధ్యాయులు ఓబులేసు, శ్రీనివాసులు, నారాయణ, కె.రామకృష్ణ, నందకుమార్, విశ్రాంతి పీడీ జయకుమార్, విశ్రాంతి డిప్యూటీ తహశీల్దార్ శివన్న, విశ్రాంతి ఆర్టీసీ ఉద్యోగి శివప్ప, విశ్రాంతి ఉపాధ్యాయులు నిత్యానాథ్, మునిరంగుడు, బైలప్ప, యుటియుసి నాయకులు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ : తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలు శుక్రవారం బహుజన చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని అంబేద్కర్ కూడలి అంబేద్కర్ విగ్రహం వద్ద దామోదరం సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా హైకోర్టు న్యాయవాది శివరామకృష్ణ మాట్లాడుతూ దామోదరం సంజీవయ్య జీవితం ఆదర్శనీయమన్నారు. ఈ కార్యక్రమంలో బహుజన చైతన్య వేదిక సభ్యులు, దళిత సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్: ప్రతిభకు కులం మతం ఏవీ అడ్డు రావని చాటి చెపుతూ అతి చిన్న వయసులోనే గొప్ప స్థాయికి ఎదిగిన మహనీయుడు దామోదర సంజీవయ్య అనిజిల్లా ఎస్పీ వి .రత్న తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో శుక్రవారం దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. దామోదర సంజీవయ్య గారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా ఎస్పీ మాట్లాడుతూ సంజీవయ్య జీవితాన్ని గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ తో పాటు ఎస్‌బి సిఐ బాలసుబ్రమణ్యం రెడ్డి, అర్ఐలు మహమ్మద్ వలి, మహేష్, ఆర్ఎస్ఐ లు వీరన్న, ప్రసాద్ ,సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

పలుచోట్ల అగ్ని ప్రమాదాలు... ఆస్తినష్టం

శ్రీసత్యసాయి జిల్లాలోని పలు మండలాల్లో శుక్రవారం అగ్నిప్రమాదాలు చోటు చేసుకున్నాయి. పొలాల్లో ఎండుగడ్డికి అకతాయిలు నిప్పుపెట్టడంతో రైతులకు సంబంధించిన మామిడి చెట్లు, డ్రిప్, స్పింక్లర్ పైపులు, గడ్డివామి దగ్ధం అయ్యాయి. ముదిగుబ్బలో మామిడితోటకు మంటలు వ్యాపించడంతో వాటిని ఆర్పడానికి వెళ్లిన కాపలా ఉన్న వృద్ధుడు మృతిచెందాడు.

మామిడి తోటకు నిప్పు.. వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మండల కేంద్రంసమీపంలోని కాకతీయ డాబా వెనుక మామిడి తోటలోని ఎండుగడ్డికి శుక్రవారం అకతాయిలు నిప్పు పెట్టారు. ఆ మంటలను ఆర్పబోయిన వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. ముదిగుబ్బకు చెందిన నాగప్ప (84) మామిడి తోటకు కాపలాగా ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తులు తోటలోని ఎండుగడ్డికి నిప్పు పెట్టారు. దీంతో మంటలు వ్యాపించాయి. ఆ మంటలను గమనించి తోటంతా వ్యాపించకుండా ఉండేందుకు నారప్ప మంటలను ఆర్పే ప్రయత్నం చేశాడు. పొగకు ఊపిరాడక ఏమి కన్పించక మంటల్లో చిక్కుకుని మృతిచెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రొద్దంలో పైపులు దగ్ధం

రొద్దం :తన పొలంలో ఎండుగడ్డికి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో డ్రిప్, స్ప్రింక్లర్ పైపులు దగ్ధమయ్యాయని బాధిత రైతు రామాంజనేయ నాయక్ వాపోయారు. మండలంలోని శ్యాపురం గ్రామంలో రైతు రామాంజనేయ నాయక్‌కు చెందిన పొలంలోని ఎండుగడ్డికి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మూడు ఎకరాలలో ఉన్న డ్రిప్పు పైపులు, పంట తర్వాత అక్కడే ఉంచిన స్పీకర్లు పైపులు కాలిపోయాయి. దీంతో తనకు రూ.30వేలకు పైగా నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని రైతు కోరారు.

ఒడిసిలో గడ్డివామి...

ఓబుళదేవర చెరువు : మండల పరిధిలోని వీరప్ప గారిపల్లిలో శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో గడ్డివామి దగ్ధమైంది. గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో రామచంద్ర అనే రైతుకు సంబంధించిన గడ్డివామి, స్ప్రింక్లర్ పైపులు కాలిపోయాయి. వేసవిలో పసుగ్రాసం కొరత రాకుండా ఉండాలని నిలువ చేసుకున్న గడ్డివామి కాలి బూడిద కావడంతో తీవ్రంగా నష్టపోయానని, పైపులు కూడా కాలిపోయాయని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. అధికారులు స్పందించి నష్టం అంచనా వేసి పరిహారం అందించి ఆదుకోవాలని కోరాడు.



దగ్ధమైన గడ్డివామి

ముదిగుబ్బలో 200 మామిడి చెట్లు ...

ముదిగుబ్బ : మండలంలోని మదన్న గారి పల్లి గ్రామ సమీపాన గుర్తు తెలియని వ్యక్తులు మామిడి తోటకు నిప్పు పెట్టడంతో చెట్లు దగ్ధం అయ్యాయని బాధిత రైతు చిన్నగాని నరసింహ యాదవ్ వాపోయారు. అకతాయిలు చేసిన పనికి 200 మామిడి చెట్లు, పీవీసీ పైపులు, డ్రిప్ పైపులు, ఫెన్సింగ్ స్తంభాలను పూర్తిగా దగ్ధం అయ్యాయన్నారు. ప్రమాద విషయం తెలుసుకున్న టిడిపి మండల కన్వీనర్ ప్రభాకర్ నాయుడు , పార్టీ రైతు సంఘం కార్యదర్శి రమేష్ బాబు, సిరిగారియల్లి రవీంద్ర తదితరులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు.

నిందితుడికి మూడేళ్ల జైలు

ప్రజాశక్తి - కొత్తచెరువు

చోరీ కేసులో నిందితుడు అమర్నాథ్ నాయుడుకు పుట్టపర్తి జె ఎఫ్ సి ఎం కోర్టు జడ్జి మూడు సంవత్సరాలు జైలు శిక్ష, రూ. 500ల జరిమానా విధించినట్లు కొత్తచెరువు సిఐ ఇందిరా తెలిపారు. గతంలో కొత్తచెరువు అప్గ్రేడ్ పోలీస్ స్టేషన్లో చోరీ కేసు నమోదు అయిందని తెలిపారు. ఈకేసులో నిందితుడికి శిక్ష పడే విధంగా తనతో పాటు ఏపీపీ రాజేంద్రప్రసాద్, కోర్టు హెడ్ కానిస్టేబుల్ రవి ప్రధాన పాత్ర పోషించామని తెలిపారు.

అన్నదమ్ముల ఇళ్లల్లో చోరీ

ప్రజాశక్తి - బత్తలపల్లి

సమీప బంధువుల ఇంటిలో శుభకార్యం జరుగుతుండడంతో ఇంటికి తాళాలు వేసి కుటుంబ సమేతంగా వెళ్లగా అన్నదమ్ముల ఇళ్లలో గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడిన సంఘటన మండల కేంద్రమైన బత్తలపల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల మేరకు బత్తలపల్లికి చెందిన కోటి చంద్రమోహన్, కోటి నాగరాజు అన్నదమ్ములు, వారి సమీప బంధువులకు చెందిన పెళ్లి గార్లదిన్నె మండలం కోటంక సమీపంలోని గుంటికింద సుబ్రమణ్యం స్వామి ఆలయంలో శుక్రవారం జరుగుతోంది. అక్కడికి ఈరెండు కుటుంబాల వారు ఇళ్లకు తాళాలు వేసుకుని వెళ్లారు ఇదే అదనుగా భావించిన గుర్తు తెలియని వ్యక్తులు ఇళ్లల్లోకి చొరబడ్డారు. చంద్రమోహన్ ఇంట్లో జత కమ్ములు, నాగరాజు ఇంట్లో చిన్న ఉంగరం ఒకటి, మహిళ ఉంగరం ఒకటి, రూ. 2వేలు నగదును ఎత్తుకెళ్లారు ఇంటి తాళాలు బాతురూంలోనూ పాలక్యానులో పెట్టడంతో దొంగలు శ్రమలేకుండా ఇంట్లోకి ప్రవేశించారు. పెళ్లి నుంచి వచ్చిన వారికి ఇంటి తాళాలు తెరిచి ఉండడంతో అనుమానం వచ్చి ఇంట్లోకి వెళ్లి చూసి దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ సోమశేఖర్ తమ సిబ్బందితో సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. స్థానికులతో సమాచారం సేకరించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహిళ అదృశ్యం.. కేసు నమోదు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

మండల పరిధిలోని బత్తలపల్లి గ్రామంలో మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు పుట్టపర్తి రూరల్ ఎస్ఐ లింగన్న తెలిపారు. బత్తలపల్లి గ్రామానికి చెందిన వినోద్ కుమార్ భార్య కావ్య అనే మహిళ ఈనెల 9వ తేదీన సాయంత్రం 6 గంటల సమయంలో ఇంటి వద్ద నుండి వెళ్లిపోయిందని ఆమె భర్త వినోద్ కుమార్ తెలిపారన్నారు. ఆయన ఫిర్యాదు మేరకు పుట్టపర్తి రూరల్ స్టేషన్లో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లింగన్న తెలిపారు, ఆమె ఆచూకీ తెలిసినవారు 9440796839 సెల్‌నెంబరుకు సమాచారమివ్వాలని కోరారు.

మృతుని కుటుంబానికి మంత్రి పరామర్శ

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మండలంలోని మద్దన్న గారి పల్లి గ్రామానికి చెందిన సామాజికవేత్త గడ్డం రాజగోపాల్ యాదవ్ అనారోగ్యంతో ఇటీవల హైదరాబాద్ ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మంత్రి సత్య కుమార్ యాదవ్ శుక్రవారం సామాజిక వేత్త గడ్డం రాజగోపాల్ యాదవ్ స్వగ్రామానికి వెళ్లి ఇంటి వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గొడ్డుమర్రి ఆదినారాయణ యాదవ్, రూరల్ సీఐ శ్యామారావు ,అర్బన్ సీఐ శివ రాముడు, సిబ్బందితో పాటు కూటమి నాయకులు రమేష్ బాబు ,ప్రభాకర్ నాయుడు, బిల్లు కుల్లాయప్ప, ఓబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ : అర్హులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను మంత్రి సత్య కుమార్ యాదవ్ శుక్రవారం పంపిణీ చేశారు. ధర్మవరంలో ఏర్పాటు చేసిన విస్తతస్థాయి కార్యకర్తల సమావేశంలో వీటిని పంపిణీ చేశారు.



మృతుని కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న మంత్రి